పనులు పూర్తి చేయించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ నరేష్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ స్మశాన వాటికకు వర్షం పడితే వెళ్లలేని పరిస్థితి ఉందని, క్రిస్టియన్ స్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలిసి చేపట్టాల్సిన పనులపై వినతిపత్రం అందజేశారు. శివాజీనగర్ కాలనీలో కమ్యూనిటీహాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వర్షాలు కురిస్తే నీరంతా కిందకు కారుతున్నందున పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని కోరారు. 14వ వార్డులో రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఉమ్రా యాత్రికులకు వీడ్కోలు



శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన బృందం

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 50 మంది యాత్రికుల బృందం బుధవారం ఉమ్రా యాత్రకు బయలుదేరింది. యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికారు. యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు. నెలలో రెండు బృందాల ఉమ్రా యాత్రకు తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

సీసీఆర్టీలో పెయింటింగ్ వర్క్‌షాప్

మాదాపూర్: మాదాపూర్‌లోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెనింగ్ (సీసీఆర్టీ)లో హైదరాబాద్ రీజినల్ సెంటర్‌లో వికసిత్ భారత్ అంశంపై బుధవారం పెయింటింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. 18 పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. భారత్ వికాస్ పరిషత్ సహకారంతో ప్రధాన మంత్రి మోదీ అభివృద్ధి దృష్టి కోణానికి అనుగుణంగా నిర్వహించారు. విద్యార్థులు విజన్ ఫర్ ఇండియా మై భారత్ అనే అంశంపై తమ కలలు అశయాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించారు. ఈ పోటీలో లోకేశ్ మొదటి బహుమతి, విశ్లావత్ అక్షయ రెండో స్థానం, సిరి మూడో స్థానంలో నిలిచారు. విద్యార్థులు తమ చిత్రాలను అధికారిక సేవా పర్వ్ పోర్టల్‌లలో అప్‌లోడ్ చేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

శేరిలింగంపల్లి: సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం ఆయన శేరిలింగంపల్లి డివిజన్‌లోని ప్రశాంతినగర్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీరోడ్లు పదికాలాల పాటు ఉండాలంటే నాణ్యత ఎంతో అవసరమన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరిత గతిన ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అంతర్గత రోడ్లన్నింటినీ దశలవారీగా సీసీరోడ్లుగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, జలమండలి మేనేజర్ అభిషేక్‌రెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, పవన్ స్థానికులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లతో కాసుల వర్షం..!

- పంచాయతీల్లో అక్రమ వసూళ్ల పర్వం
- నిబంధనల పేరుతో పంచాయతీ కార్యదర్శుల దందా



పెద్దషాపూర్‌లో వేర్వేరుగా రెండు ఇంటి నంబర్లు జారీ చేసిన ఖాళీ స్థలం ఇదే..



పెద్దషాపూర్‌లో మాధవి ఆస్తిపన్ను చెల్లించిన రశీదు



పెద్దషాపూర్‌లో మాధవికి జారీ చేసిన డిమాండ్ నోటీసు

శంషాబాద్ రూరల్: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పంచాయతీల్లో అక్రమాలకు అంతు లేకుండా పోతోంది. ముఖ్యంగా ఇంటి నంబర్ల జారీ సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తోంది. పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్ల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. చేయి తడపకుంటే ఏ పని జరగడంలేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల నుంచి ఇన్‌చార్జి ఎంపీఓ ఉండగా.. పంచాయతీల్లోని అక్రమాలపై నియంత్రణ లేకుండా పోతోంది.

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు..

మండలంలో 21 పంచాయతీలు ఉండగా.. పెద్ద తూప్ర, ముచ్చింతల్ మినహా మిగిలిన పంచాయతీలు జీఓ 111 పరిధిలో ఉన్నాయి. జీఓ నిబంధనల ప్రకారం.. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వరు. అయితే స్థానికంగా జనాభా పెరుగుతండడంతో.. గ్రామ కంఠం స్థలాలతో పాటు కొత్తగా ఏర్పడిన లేఅవుట్లలో గ్రామస్తులు నిర్మాణాలు చేపట్టారు. వీటికి ఇంటి నంబర్ల జారీ కోసం పంచాయతీ అధికారులు, సిబ్బంది అందిన కాడికి దండుకుంటున్నారు. ఒక్కో ఇంటి నంబర్‌కు కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే పంచాయతీ కార్యదర్శుల అక్రమార్జనలో మరో అడుగు ముందుకు వేసి.. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారు. ఇందు కోసం రూ.లక్షల్లో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల తాత్కాలిక నిర్మాణాలకు సైతం ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారు.

ప్రహరీలతో పండగ..

భూముల ధరలకు రెక్కలు రావడం...వివిధ కారణాలతో ఏర్పడుతున్న వివాదాలతో చాలా చోట్ల ప్లాట్లు, పంట పొలాలు, భూముల చుట్టూ రక్షణ కోసం ప్రహరీ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందు కోసం ప్రీకాస్టు గోడల నిర్మాణం చేస్తున్నారు. వీటికి అనధికార అనుమతుల పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. అధికారుల, సిబ్బంది అక్రమ వసూళ్లతో వారి జేబులు నిండుతుండగా.. పంచాయతీలకు ఎలాంటి ఆదాయం సమకూరడంలేదు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం గడువు పూర్తయి ఏడాదిన్నర కాలం గడిచింది. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అయితే ఆయా పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులకు పంచాయతీ పాలనపై పూర్తిస్థాయి అవగాహన, పట్టు లేకపోవడంతో అక్రమాలకు అడ్డులేకుండా పోతుంది. నామమాత్రంగా పంచాయతీల సందర్శనతోనే ప్రత్యేకాధికారులు కాలం గడుపుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదనిన విమర్శలు ఉన్నాయి.

వెలుగులోకి వచ్చినా..

రామంజాపూర్‌లో పంచాయతీ కారోబార్ తప్పుడు రశీదులతో ఆస్తి పన్నులు వసూలు చేసినట్లు వెలుగులోకి వచ్చి సుమారు రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ఈ అక్రమాల్లో అధికారుల వాటా ఉందనే కారణంతో జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆస్తి పన్ను పక్కదారి పట్టించినట్టు ఆధారాలతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా.. ఈ విషయంపై పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

> **రెండేళ్లుగా తిరుగుతున్నా..**
>
> నేను స్థానికంగా వెంచరులో రెండేళ్ల కిందట ఇల్లు నిర్మించుకున్నాను. ఇంటి నంబరు కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. ఇప్పటి వరకు ఇంటి నంబరు జారీ చేయలేదు. నా తర్వాత కట్టిన ఇళ్లకు మాత్రం వెంటనే ఇంటి నంబర్లు కేటాయించారు. ఈ విషయమై జిల్లా కలెక్టరుకు ఇటీవలే ఫిర్యాదు కూడా చేశాను.
>
> – వి.శ్రవణ్‌కుమార్, పెద్దషాపూర్

- పెద్దషాపూర్ పంచాయతీలో జీపీఆర్ వెంచరులో సుమారు రెండు వేల గజాలకు పైగా ఉన్న ప్లాటులో ఎలాంటి నిర్మాణం చేపట్టలేదు. ఈ ఖాళీ స్థలానికి రెండు ఇంటి నంబర్లు 4-25/2/51/ఏ, 52/ఏ జారీ చేశారు. ఇక్కడ రేకులతో పైకప్పు నిర్మాణం ఉన్నట్లు జారీ పత్రంలో నమోదు చేయడం గమనార్హం. అక్కడ లేని నిర్మాణానికి రూ.2416 చొప్పున ఆస్తి పన్ను కూడా వసూలు చేస్తూ ఇంటి నంబరు జారీ అయింది.
- పెద్దషాపూర్ పంచాయతీలో జిల్లా రమేష్ మృతి చెందడంతో ఇతని పేరుతో ఉన్న ఇంటిని తన పేరుపై మార్పిడి చేయాలని అతని భార్య మాధవి పంచాయతీ కార్యాలయం సంప్రదించింది. దీంతో రమేష్ పేరుతో ఈ ఏడాది మార్చి నెలలో రశీదు నం. 6552తో రూ.660 ఆస్తి పన్ను(రెండేళ్ల కాలపరిమితి(2023-24-25) వసూలు చేశారు. ఈ ఆస్తిని భార్య పేరుతో మార్పిడి చేసిన తర్వాత మే నెలలో మరో సారి రెండేళ్ల కాలపరిమితి(2024-25-26)కి గాను రశీదు నెంబరు 6976తో రూ.694 పన్ను వసూలు చేశారు. దీని తర్వాత సదరు ఇంటి యజమానికి ఆగస్టులో రూ.694 పన్ను చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఒకే ఆస్తిపై రెండు సార్లు పన్ను వసూలు చేసిన తర్వాత కూడా డిమాండ్ నోటీసు జారీ చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పన్ను వసూలుకు సంబంధించిన రశీదులు నకిలీవిగా అనుమనిస్తున్నారు. అక్రమాలపై ఇన్‌చార్జి ఎంపీఓ మధుసూధన్‌రెడ్డి వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేరు.



నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో..

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 17వ తేదీని పురస్కరించుకుని బుధవారం జాతీయ జెండాలను ఎగరవేసి ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. మణికొండ మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ ప్రదీప్‌కుమార్, నార్సింగి మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద చైర్మన్ కె. వేణుగౌడ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నగేష్‌యాదవ్ జాతీయ జెండాలను ఆవిష్కరించి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మణికొండ అధ్యక్షుడు డి. సీతారాం జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ విలీన దినోత్సవాన్ని జరుపుకున్నారు.



మణికొండ మున్సిపల్ కార్యాలయం వద్ద..



మణికొండలో..



నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయంలో..



శంషాబాద్ మండలంలో



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..



శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..



బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో...



తెలంగాణ పోలీస్ అకాడమీలో ..



బండ్లగూడ: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తెలంగాణ పోలీస్ అకాడమీలో రాణి రుద్రమ దేవి ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎందరో అమరుల ప్రాణ త్యాగంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మురళీధర్, డీప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి, ప్రసాద్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, వి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదినోత్సవం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మణికొండ: దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినోత్సవాన్ని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో రక్తదానం, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పేదలకు పండ్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే దేశానికి గుర్తింపు తేవడంతో పాటు విశ్వగురువుగా ఎదిగేందుకు బాటలు వేస్తున్న వ్యక్తి నరేంద్రమోదీ అన్నారు. ఆయన సారథ్యంలో దేశం అన్ని విధాల అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ మున్సిపాలిటీల అధ్యక్షులు బి. రవికాంత్‌రెడ్డి, ఎం .నగేష్‌యాదవ్, మణికొండ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, నాయకులు డి.,లక్ష్మీనారాయణ, సి.బీరప్ప, శివరామకృష్ణారెడ్డి, సీహెచ్. బిక్షపతియాదవ్, కె. శ్రీనివాస్‌రెడ్డి, జె.సిద్దప్ప, ఇందిర, యాదయ్య, బి.శివకుమార్, ఆనంద్‌రావు, శంకర్‌సింగ్, శివరాజ్, జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి,మాజీ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఛాప్ 2025

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఛాప్ 2025 కార్యక్రమం బుధవారం ముగిసింది. వారం రోజులుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్పత్తులను ప్రదర్శించిన కళాకారులకు అవార్డులను అందజేశారు.

చెరువుకు హద్దులు నిర్ణయించండి

మణికొండ: నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న ముష్కి చెరువు పరిరక్షణకు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని చెరువు పరిరక్షణ సంఘం సభ్యులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు సరైన హద్దులు లేక పోవటంతో చెరువు అన్యాక్రాంతమవుతోందని, దాన్ని అడ్డుకోవాలంటే ముందుగా సర్వే చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాని పక్కనే ఉన్న సంకటహర హనుమాన్ దేవాలయం ప్రభుత్వ భూమిలో ఉన్నా సదరు భూమి తమది అంటూ కొందరు వస్తున్నారని, దానికి హద్దులను నిర్ణయిస్తే తామంతా కలిసి కట్టుగా పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదులు చేశామని, చెరువు, దేవాలయం, ప్రభుత్వ భూమి పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరామన్నారు. కార్యక్రమంలో నాయకుడు గౌతం రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మియాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ లయన్ అన్యంకోటి రెడ్డి అన్నారు. బుధవారం మియాపూర్ డివిజన్, మయూరినగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. నగరంలో పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణ కోసం స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మయూరినగర్ ప్రెసిడెంట్ రామరాజు, సెక్రటరీ కిషోర్ కుమార్, వెంకట్ రావు, రమేష్, ఆదినారాయణ, రత్తయ్య, లయన్ వెంకట్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా సహాయం అందజేస్తున్నారని వివరించారు. సందర్భంగా రూ.2.40 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞమహోత్సవం



కార్తీక్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: విశ్వకర్మ జయంతి ప్రతి వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్ని ,కృషి, ప్రేరణను అందించే ప్రత్యేక దినంగా నిలువాలని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు.బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శాంతినగర్ శ్రీవిశ్వకర్మ దేవాలయంలో ఆలయ కమిటీ నిర్వహించిన విశ్వకర్మ యజ్ఞమహోత్సవంలో ఆయన నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..విశ్వకర్మ జయంతి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పండుగగా అభివర్ణించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్ ,దేవాలయ వ్యవస్థాపకులు పులిగిళ్ల శ్రీనివాస్ చారి,కాసోజి మాధవచారి,రమేష్ చారి, రవీంద్ర చారి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలు సమాజ నిర్మాతలు

మైలార్‌దేవ్‌పల్లి: సమాజ నిర్మాణంలో విశ్వ కర్మ కులస్తుల పాత్ర ఎంతో ఉందని ,వారి కృషి నైపుణ్యం లేనిదే అభివృద్ధి అసాధ్యమని స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం కాటేదాన్ శాంతి నగర్‌లో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ,స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుద్వేల్ గ్రామంలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ గ్రామంలో విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా మల్లేష్ చారి, రాఘవేంద్ర చారి ఆధ్వర్యంలో బుధవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వై.శ్రీధర్, మల్లేష్ యాదవ్, పసుపుల ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్, బాలకృష్ణ, ఎల్.వెంకటేష్, సరితా రెడ్డి, రమాదేవి, లావణ్య, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

వ్యాపారిని బెదిరించి డబ్బులు వసూలు

ముగ్గురు నిందితుల రిమాండ్...



పోలీసుల అదుపులో నిందితులు

అత్తాపూర్: ఓ వ్యక్తిని బెదిరింపు డబ్బులు కాజేసిన ముగ్గురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి వట్టెపల్లి ప్రాంతానికి చెందిన మహ్మద్ అజహర్ చార్మినార్ ప్రాంతంలో వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. అతడికి ఆన్‌లైన్ ద్వారా అత్తాపూర్ ఎం.ఎం . పహాడ్‌కు చెందిన మహ్మద్ సోహేల్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో ఒకరినొకరు కలుద్దామని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని సోహేల్ తన స్నేహితులైన మహ్మద్ మఖ్దూం అలీ ఆలియాస్ మఖ్దూం, మహ్మద్ అబ్దుల్ వాసిఫ్‌కు చెప్పాడు. దీంతో ముగ్గురూ కలిసి అజహర్‌ను బెదిరించి దోచుకోవాలని పథకం వేశారు. ఈ నెల 16న అజహర్ బైక్‌పై చింతల్‌మేట్ ఎక్స్ రోడ్డులోని డెక్కన్ ఎలైట్ హోటల్‌కు వెళ్లాడు. దీంతో వారు అతడిని మరో చోటికి తీసుకెళ్లి చితకబాదారు. అనంతరం బలవంతంగా గూగుల్ పే రూ.10 వేలు బదిలీ చేయించుకోవడమేగాక అతడి సెల్‌ఫోన్‌ను సైతం లాక్కుని పారిపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసిన మహిళ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. మృతురాలిని నగరంలోని ఆఘాపురాకు చెందిన మహిళగా గుర్తించారు. ప్రత్యేక టీమ్‌తో మహిళ కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పట్టి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. త్వరలో కేసును చేధిస్తామని పోలీసులు వెల్లడించారు.